## లింగాయత్‌సహా పలు బిసి కులాలకు త్వరలోనే జాతీయ ఒబిసి జాబితాలో చోటు

### జాతీయ ఒబిసి కమిషన్ హన్స్‌రాజ్ గంగారం ఆహిర్ హామీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చాలా రోజులుగా డిమాండలో ఉన్న లింగాయత్‌తో పాటు మరికొన్ని కులాలను త్వరలోనే జాతీయ ఒబిసి జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుందని జాతీయ ఒబిసి కమిషనర్ చైర్మన్ హన్సరాజ్ గంగరాం ఆహిర్ తెలిపారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన హన్సరాజ్‌ను వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన నేతలు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ సమక్షంలో కలిసారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమతో పాటు పలు బిసి సామాజిక వర్గాలు, ఒబిసి కమిషన్ చైర్మన్ కలిసి తమను జాతీయ ఒబిసి జాబితాలో లేకపోవడం వల్ల విద్యా, ఉద్యోగాలు పరంగా నష్టపోతున్నామని పేర్కొంటూ వినతి పత్రం అందించారు. తాము పూర్తిగా జాతీయ ఒబిసి జాబితాలో చేరేందుకు అర్హులమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన హన్సరాజ్ తప్పకుండా లింగాయత్‌తో సహా ఆయా కులాలను జాతీయ ఒబిసి జాబితాలో చేరుస్తామని హామి ఇచ్చారు. రాష్ట్ర అధిరార ప్రతినిధి జె.సంగప్ప, వీరశైవ లింగాయత్ పెద్దలు అశోక్ ముస్తాపురే, సంకటాల సోమేశ్వర్,మల్లికార్జున్, చంద్రశేఖర్‌లు ఉన్నారు.



పురస్కార గ్రహీతలతో టి.కిషన్‌రావు. చిత్రంలో కొలకలూరి ఇనాక్, యార్లగడ్డ రాఘవేంద్రరావు తదితరులు

## కొలకలూరి పురస్కారాలు ఎంతో ప్రతిష్టాత్మకం

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రసిద్ధిగాంచిన కొలకలూరి పురస్కారాలు అందుకోవడం గొప్ప విషయమని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య టి.కిషన్‌రావు చెప్పారు. పురస్కారాలకు ప్రముఖులను ఎంపిక చేయడంలో ఎన్నో జాగ్రత్తలను తీసుకుంటారని, ఇందుకు ఉదాహరణ నేడు ప్రముఖులను పురస్కారాలు ఎంపిక చేయడమే కారణమన్నారు. కొలకలూరి అనితా శ్రీకిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కొలకలూరి పురస్కారాల-2023 ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొలకలూరి భాగీరధి కవితా పురస్కారాన్ని యార్లగడ్డ రాఘవేంద్రరావుకు-'పచ్చికదుపు వాసన', కటుకోజ్వల ఆనందాచారికు- 'ఇక ఇప్పుడు', కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం ఆకెళ్ల వెంకటసూర్యనారాయణకు- 'ఆకెళ్ల నాటికలు', కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం డా.ఎం.దేవేంద్రకు- 'తెలంగాణ కథ-వర్తమాన జీవన చిత్రణ', డా.ఎం.ఎ.నాగేంద్రకు-'రాచపాళెం సాహిత్య విమర్శ- సమగ్ర అధ్యయనం' ముఖ్యఅతిథి ప్రదానం చేశారు. ఈ పురస్కారాలపై ఆచార్య కొలకలూరి ఇనాక్ సవివరంగా వివరిచారు. పిహెచ్‌డి స్వీకర్త డా.మంచాల మహేశ్వర్‌కు పరిశోధక సన్మానం జరిగింది. ఈ సభకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించగా సభలో విశిష్ట అతిథిగా ఆచార్య కొలకలూరి సుమకిరణ్, రింగు రామమూర్తి, డా.బి.హెచ్.పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ శివార్లలో మరో దారుణహత్య

### స్నేహితుడే నిందితుడని తేల్చిన పోలీసులు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్నేహితుడిని అతిదారుణంగా హత్య చేసిన ఘటనపై పోలీసుల విచారణ జరుగుతుండగానే హైదరాబాద్ నగర శివార్లలో మరో ఘోరమైన హత్య వెలుగుచూసింది. ఈ ఉదంతంలో కూడా తోటి స్నేహితుడే హత్యకు పాల్పడడం కలకలం రేపింది. తనపై అనుచిత అసభ్య వ్యాఖ్యలు చేయడాన్ని సహించలేక ఓ యువకుడు స్నేహితుడిని కర్రతో ఆ తర్వాత రాయితో తలపై మోది కిరాతకంగా హత్యచేసి సంఘటన స్థలంకు కొద్ది దూరంలో మృతదేహం కనిపించకుండా రాళ్ళను కప్పి ఉంచాడు. దీంతో చాలారోజుల తర్వాత హత్యోదంతం బయటపడింది. మొదట మిస్సింగ్ కేసు కింద దర్యాప్తు చేస్తున్న పోలీసులకు మృతుడి సెల్‌ఫోన్‌కు వచ్చిన కాల్స్‌ను పరిశీలించగా హత్య చేసిన నిందితుడి గుట్టురట్టైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ హత్యోదంతం నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. షాహిన్‌నగర్ సమీపంలోని ఉస్మాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫైసల్ ఖాన్ (27) పత్తర్‌ఘాట్ ప్రాంతంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మన్‌గా పని చేస్తుంటారు. ఐదు నెలల క్రితం వివాహం వివాహం జరగగా ప్రస్తుతం అతని భార్య గర్భవతిగా ఉంది. అయితే ఈ నెల 12వ తేదీన రాత్రి సమయంలో ఫోన్ రావడంతో బయటకు వెళ్ళిన ఫైసల్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బాలాపూర్ పిఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. అయితే రోజులు గడుస్తున్నా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులు ఫైసల్ ఫోన్ కాల్ డేటాను పరిశీలించారు. ఈ క్రమంలో ఫైసల్ స్నేహితుడైన చార్మినార్‌లోని ఓ కాస్మటిక్ షాపులో పని చేసే షాహిన్‌నగర్ మినార్ కాలనీకి చెందిన అబ్దుల్ జబ్బార్‌ను విచారించగా హత్య విషయం బయట పడింది. ఎగ్జిబిషన్‌కు రానందుకు జరిగిన వాగ్వివాదంలో తనను తీవ్ర పదజాలంతో దూషించడంతో భరించలేక తన ఇంటి సమీపంలోని ఓ ఖాళీప్లాట్ వద్ద మొదట్లో కర్రతో తలపై కొట్టి ఆ తర్వాత కొద్ది దూరం వరకు ఈడ్చుకెళ్ళి బండరాళ్ళతో మోది హత్య చేసినట్లు జబ్బార్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. మృతదేహం కనిపించకుండా రాళ్ళను అడ్డుగా పెట్టడంతో హత్యోదంతో ఆలస్యంగా వెలుగు చూసింది. బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతున్నది.



మృతుడు ఫైసల్ ఖాన్ (ఫైల్)

# శ్రద్ధావాకర్ హత్యోదంతం తర్వాత పెరిగిన కిరాతక హత్యలు

### తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మూడు ఘటనలు

### రాక్షసత్వాన్ని చూపే ఇటువంటి ఘటనలు సమాజహితం కావు: మానసిక నిపుణులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో గత ఏడాది మే నెలలో జరిగిన శ్రద్ధావాకర్ అనే యువతి దారుణ హత్యోదంతం తరువాత అటువంటి కిరాతక హత్యలు దేశ వ్యాప్తంగా పెరిగి పోవడం అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతుండగా ఆయా ప్రాంతాల పోలీసులకు సవాల్‌గా మారుతోంది. హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్‌మేట్‌లో ఒక అమ్మాయి విషయంలో చెలరేగిన వివాదం కారణంగా తనతో కలిసి చదువుకున్న సహచర విద్యార్థిని మరో విద్యార్థి అతి దారుణ ంగా హత్య చేసి శరీర భాగాలను వేరుచేసి వీటిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి తన ప్రేయసికి పంపడం సంచలనం రేపింది. ఇటువంటి ఘటనే శివార్లలోని బాలాపూర్‌లో ఆదివారం వెలుగుచూసింది. అయితే ఈ ఘటనలో పాత కక్షలు వుండడం గమనార్హం. ఇదే తరహాలో ఎపిలోని పల్నాడు జిల్లాలో జరగగా పాత కక్షాల కారణంగా త మ ప్రత్యర్థి అయిన వ్యక్తిని చంపి 16 ముక్కలు చేసి పెట్రోల్ పోసి దహనం చేసిన తండ్రి కొడుకులు, వారికి సహకరించిన తల్లిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా ఇటువంటి ఘటనలు మనిషిలోని క్రూరత్వాన్ని, భయంకరమైన నేర స్వభావాన్ని, రాక్షసత్వాన్ని బయటపెట్టడం వంటిదని మానసిక నిపుణులు అంటున్నారు. ఈ తరహా ఘటనలు సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని, వీటిని మొగ్గలోనే తుంచి వేయాలని వారంటున్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో గత ఏడాది మే నెలలో వెలుగుచూసిన శ్రద్ధావాకర్ అనే యువతి హత్యోదంతం ఎంత సంచలనం రేపిందో తెలిసిందే. ఆ యువతి ప్రియుడు అ ఫ్తాబ్ అమీన్ పునావాల ఈ దారుణానికి పాల్పడి చివరకు పోలీసులకు దొరికిపోవడం విదితమే. శ్రద్ధావాకర్ శవాన్ని 35 ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో దాచివుంచి కొన్ని రో జులపాటు వాటిని కొద్దికొద్దిగా దూరంగా గల అటవీ ప్రాంతంలో పడవేసిన పూనావాలా ఇందులో తనకేమి తెలియదని బుకాయించి చివరకు నేరాన్ని అంగీకరించి ఊ చలు లెక్కపెడుతున్నాడు. శ్రద్ధావాకర్ హత్యపై విచారణ సాగుతోంది. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ఢిల్లీ పోలీసులు బలమైన ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసును ఫా స్టట్రాక్ కోర్టులో విచారణ జరిగేలా చూస్తామని, నిందితుడికి త్వరలోనే శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ హత్య తరువాత దేశ వ్యాప్తంగా ఇటువంటివి అనేకం జరగడం ఆయా ప్రాంతాల పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఇక ఇటు వంటి ఘటన తెలంగాణలో మూడు రోజుల క్రితం తొలిసారి గా వెలుగు చూసింది. హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్ ఈ ఘటన జరిగింది. నేనావత్ నవీన్ అనే బిటెక్ విద్యార్థినిని అతని స్నేహితుడు బిటెక్ విద్యార్థి అ యిన హరిహరకృష్ణ ఒక అమ్మాయి విషయంలో తగాదా పడి దారుణంగా చంపాడు. హరిహరకృష్ణ ప్రేమించిన యువతిని నవీన్ కూడా ఇష్టపడడంతో ఇద్దరి మధ్య వి వాదం నెలకొంది. దీంతో హరిహరకృష్ణ ఒక పథకం ప్రకారం వారం రోజుల క్రితం నవీన్‌ను పార్టీ చేసుకుందామని పిలిచి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం అ తని గుండె, మర్మాంగాలు, తల, చేతివేళ్లను కత్తితో వేరుచేశాడు. దీని తరువాత వీటిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి తన ప్రేయసి ఫోన్‌లో పంపాడు. హైదరాబాద్‌లో ఇటు వంటి క్రూరమైన హత్యలు ఇటీవల కాలంలో వెలుగుచూడలేదు. పాతకక్షల కారణంగా ఇతర గొడవల వల్ల అనేక హత్యలు జరిగినా ఇంత భయంకరమైన హత్య ఇదే తొలిసారిగా చెప్పాలి. కాగా నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ప్రొఫెషనల్ నేరగాడు కాకపోవడం గమనార్హం. అతను మొదటిసారిగా హత్యకు పాల్పడగా హత్య తరు వాత శరీర భాగాలను పలుచోట్ల పడవేసి వాటి వద్ద కొన్ని గంటల పాటు గడిపాడంటే అతని మానసిక పరిస్థితి ఎంతటి క్రూరంగా, హేయంగా వుందో ఊహించుకోవ చ్చు. కాగా నవీన్‌ను హత్య చేసిన మూడు రోజుల తరువాత అతను పోలీసులకు లొంగిపోయాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ హ త్యలో హరిహరకృష్ణ ప్రేయసితో పాటు ఇంకా ఎవరైనా వున్నారా...? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య ఇలావుంటే ఎపిలోని పల్నాడు జిల్లా దాచే పల్లిలో ఇటువంటి ఘోరం ఒకటి వెలుగు చూసింది. కోటేశ్వరరావు అనే వ్యక్తిపై పాతకక్షల కారణంగా అదే ప్రాంతానికి చెందిన సైదులు అనే వ్యక్తి తన కుమారుడితో క లిసి వెనుక నుంచి ఇనుపరాడ్లలో తలపై మోది హత్య చేశాడు. అనంతరం కోటేశ్వరరావు శవాన్ని గొడ్డలితో 16 ముక్కలుగా చేశారు. దీని తరువాత కోటేశ్వరరావు శవాన్ని తమ పొలంలోనే కుప్పగాపోసి, వాటిపై కట్టెలు పేర్చి పెట్రోల్ పోసి దహనం చేశారు. కాగా కోటేశ్వరరావు కోసం కుటుంబం దీనిపై ఆరాతీయగా సైదులు పొల ంలో మంటలు చూసి అనుమానం వచ్చి రాగా మంటల్లో కాలు కాలుతుండడం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో సైదులు, అతని కుమా రుడు హత్య తరువాత బట్టలను మార్చుకుని, హత్య సమయంలో వాటిన దుస్తులను పక్కకు పెట్టారు. వీటిని సైదులు భార్య కాల్చేందుకు యత్నిస్తుండగా పోలీసులు అందరిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఎపిలో సంచలనం రేపింది. పల్నాడు జిల్లాలో జరిగిన ఘటన ఇలావుంటే హైదరాబాద్ శివార్లలోని బాలాపూర్‌లో ఇదే తరహాలో మరో దారుణ హత్య శనివారం రాత్రి వెలుగు చూసింది. స్థానిక ఉస్మాన్‌నగర్ ప్రాంతానికి చెందిన ఫైజల్ (23) అనే యువకుడు ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని తల్లిదండ్రులు దీనిపై 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసు కుని గాలించసాగారు. పోలీసులు ఓవైపు ఫైజల్ కోసం గాలిస్తుండ గానే అతని శవం ఉస్మాన్‌నగర్‌కు సమీపంలోని మినార్ కాలనీ సమీపంలో తలలేని మొండెంగా కనిపించింది. ఫైజల్‌ను అతని స్నేహితుడితో పాటు మరికొందరు హత్య చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు. హతుడు ఫైజల్‌కు ఆరు నెలల క్రితం వివాహం అయ్యిందని పోలీసులు చెబుతున్నారు.

**ఈ తరహా ఘటనలు సమాజానికి చేటు తెస్తాయి: మానసిక నిపుణులు**

కాగా శ్రద్ధావాకర్ హత్యోదంతం తరువాత తెలుగు రాష్ట్రాలో వెలుగుచూసిన ఈ తరహా మూడు ఘటనలు సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని మానసిక ని పుణులు అంటున్నారు. ఈ తరహా ఘటనలు మనిషిలోని రాక్షసత్వానికి పరాకాష్టగా వారు చెబుతున్నారు. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ అంతకు ముందు యూ ట్యూబ్‌లలో హత్యలకు సంబంధించిన దృశ్యాలను చూసినట్లు తేలడంతో యువత ప్రసారమాధ్యల వల్ల పెడదోవ పడుతున్నట్లుగా వారు చెబుతున్నారు. ఈ తరహా ఘ టనలపై పోలీసులు మొదట్లోనే ఉక్కుపాదం మోపాలని, ఇదే సమయంలో తమ పిల్లలు ఏం చేస్తున్నారు...? ఎక్కడికి వెళుతున్నారు...? గంటల తరబడి సెల్‌ఫోన్లతో గడిపితే అలా ఎందుకు చేస్తున్నారనే విషయాలను తల్లిదండ్రులు గమనించి, వారిని మంచి మార్గంలో వెళ్లేలా చూడాలని నిపుణులు కోరుతున్నారు.

## ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్



**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** వరంగల్ కెఎంసి పిజి వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రీతిని, ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రీతికి మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో నిగూఢంగా ఇంకా ర్యాగింగ్ కొనసాగుతోందని మెడికల్ కాలేజీల్లో పిజి చదివే అమ్మాయిలను సీనియర్లు వేధింపులకు గురిచేస్తున్నారని ప్రీతి ఘటనతో స్పష్టమైందని అన్నారు. ఇలాంటి ఘటనలు వెలుగు చూసినపుడు హెచ్‌వోడిలే చర్యలు తీసుకోవాలని ప్రీతి విషయంలో సకాలంలో హెచ్‌వోడి స్పందించి చర్యలు తీసుకుని ఉంటే ఆమె ఆత్మహత్యాయత్నం చేసుకునేదికాదని అన్నారు. ఇక్కడ అన్ని వ్యవస్థలు విఫల మయ్యాయని అర్థమవుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈటల డిమాండ్ చేశారు.

**ప్రీతి ఆరోగ్యం ఏమాత్రం మెరుగ్గాలేదు: తండ్రి నరేంద్ర**

ప్రీతి ఆరోగ్య పరిస్థితి మొదటి రోజుతో పోలిస్తే మరింత క్షీణించిందని ఆమె తండ్రి నరేంద్ర తెలిపారు. నిమ్స్ వద్ద ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్న ప్పటికీ తమ కుమార్తె బతుకుతుందనే ఆశ కని పించడం లేదని వాపోయారు. వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తారని ఆశించినప్పటికీ అలాంటి పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రీతి ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడటం లేదని బతికే అవకాశాలు లేవని వైద్యులు కూడా చెప్పారని వెల్లడించారు. ఆదివారం పలువురు రాజకీయ నేతలు నిమ్స్ ఆసుపత్రికి వచ్చి ప్రీతి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని ప్రీతి తల్లిదండ్రులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎంపి మాలోత్ కవిత, తదితరులు ఉన్నారు. వైద్య విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం రూ.5కోట్ల పరిహారం ఇవ్వాలని ప్రిన్సిపల్ హెచ్‌వోడిలపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

## హత్యపై అందరినీ తప్పుదోవ పట్టించిన నిందితుడు

### వారం తర్వాత కుటుంబసభ్యుల ఒత్తిడితో లొంగిపోయిన హరిహరకృష్ణ

### కాల్‌డేటాను తీస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి..

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 17న రాత్రి జరిగిన బిటెక్ విద్యార్థి హత్యకేసులో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకే యువతిని ఇద్దరు యువకులు ప్రేమించిన కారణంగానే ఈ హ్యత జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. అయితే హత్య జరిగిన విషయం తెలిసి కూడా సదరు యువతి హత్య ఉదంతంపై ఎవరికి చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోంది. హత్యలో యువతి పాత్రపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. 17న నవీన్‌ను హత్యచేసిన హరిహరకృష్ణ 18న ఉదయం వరంగల్‌కు వెళ్లి నవీన్ స్నేహితుల నుంచి ఫోన్లు రావడంతో తిరిగి 19న హైదరా బాద్‌కు వచ్చాడు. 22వ తేదీ నుంచి హరిహరకృష్ణ కళాశాలకు రావడంలేదని తల్లిదండ్రులకు ఫోన్లురాగా వారు కుమారుడికి ఫోన్లు చేశారు. పరీక్షల కోసం తమ కుమారుడు హైదరాబాద్‌కు వచ్చాడని వారు చెప్పారు. అనంతరం కుమారుడి ఫోన్ స్విచ్చాప్ వచ్చింది. మృతి చెందిన నవీన్ మామయ్య కూడా హరిహరకృష్ణ తల్లిదండ్రులకు ఫోన్లు చేయగా... తమ వద్ద లేదని వారు సమాధానమిచ్చారు. తమ సోదరుడు కన్పించడం లేదని, ఫోన్ స్విచ్చాఫ్ వస్తోందని హరిహరకృష్ణ సోదరి సైతం మలక్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. నవీన్ కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆమె కూడా వరంగల్ వెళ్లిపోయింది. 23న హరిహరకృష్ణ తిరిగి వరంగల్‌లోని కుటుంబసభ్యుల వద్దకు చేరుకున్నాడు. కుటుంబసభ్యులు నవీన్ విషయమై గట్టిగా నిలదీయడంతో తానే హత్య చేసినట్లు వారికి తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు అతన్ని పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని సూచించారు. ఈ మేరకు వారు 24న మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా... హరిహరకృష్ణ మాత్రం మలక్‌పేటకు వెళ్లకుండా అదేరోజు సాయం త్రం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగి పోయినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. నవీన్ హత్య వెనుక తన కుమారుడే కాకుండా ఇతరుల ప్రమేయం ఉండవచ్చని హరిహరకృష్ణ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తన కుమారుడి ఒక్కడితో ఇంతటి క్రూరమైన చర్యకు దిగక పోవచ్చని... శరీరంలోని అవయవాలు కోసే ధైర్యం చేయకపోవచ్చని వారు తెలిపారు. తన కుమారుడి కాల్‌డేటాను విచారిస్తే సంఘటనకు సంబంధించిన మరిన్ని విషయాలు బయట పడతాయని వారు తెలిపారు.

**అందరినీ తప్పుదోవ పట్టించాడు**

హరిహరకృష్ణ నవీన్ విషయమై అతని తల్లిదండ్రులను పూర్తిగా తప్పుదోవ పట్టించాడు. తాను ఔటర్ రింగురోడ్డు వద్ద అతన్ని వదిలేసి వెళ్లినట్లు చెప్పాడు. అది కూడా స్వయంగా అతనే నవీన్ తల్లిదండ్రులకు చెప్పడం గమనార్హం. హత్య జరిగినరోజు రాత్రి 8.30 గంటల వరకు తాను వస్తానని తనకోసం ఫుడ్‌తీసి ఉంచాలని నవీన్ స్నేహితులకు చెప్పగా... ఉదయం వరకు రాకపోవడంతో స్నేహితుల ద్వారా హరిహరకృష్ణ నెంబరును కనుక్కున్న వారు అతన్ని నిలదీశారు. తాను రాత్రే అతన్ని వదిలివేశానని చెప్పాడు. మరుసటిరోజు ఉదయం నవీన్ రాలేదని మీరు వస్తే పోలీసులకు ఫిర్యాదు చేద్దామని అతని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు 21న రాగా... తాను కాలేజ్ నుంచి వస్తున్నానని చెప్పి రాకపోవడంతో అతనిపై అనుమానం వ్యక్తం చేశారు.

## ఒకే వ్యక్తికి దేశ సంపదను దోచిపెట్టిన ప్రధాని మోడీ

### కేంద్ర తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### కాంగ్రెస్ ప్లీనరీ చివరిరోజున కార్యకర్తలకు ఖర్గే పిలుపు

**రాయ్‌పూర్, ఫిబ్రవరి 26:** కాంగ్రెస్ ప్లీనరీ చివరి రోజైన ఆదివారం గౌతమ్ అదానీ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే దుయ్యబట్టారు. ఒకే వ్యక్తికి ప్రజా ధనాన్నీ, ఆస్తులనూ ప్రధాని మోడీ కట్టబెట్టారని ఖర్గే విమర్శించారు. చత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన మూడురోజుల ప్లీనరీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో ఖర్గే ప్రసం గిస్తూ..దేశ సంపదను కొంతమంది వ్యక్తులు దోచు కుంటున్నారని, ప్రజల ధనాన్నీ, ఆస్తులను ఒకే వ్యక్తికి మోడీ కట్టబెట్టారని అన్నారు. బలిసిన ఏనుగు మాదిరిగా అదానీని చాలా పెద్దవాడిని చేశారని ఆయన మండిపడ్డారు. చైనాతో సరిహద్దుల అంశంపైనా కేంద్రంపై ఖర్గే విమర్శలు గుప్పించారు. పొరుగు దేశమైన చైనాతో సంబంధాలు క్షీణించినా.. ఆ దేశానికి కేంద్రం క్లీన్‌చిట్ ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తప్పిదాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలన్నారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతి కార్యకర్త అంతిమశ్వాస వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన ప్రసంగం పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తినీ, నూతనోత్తేజాన్నీ నింపిందని ఖర్గే ప్రశంసించారు. 'మనం చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. సిడబ్ల్యూసి సీట్లలో 50 శాతం మహిళలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, యువతకు కేటాయించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ పార్టీ అంటేనే.. దేశభక్తి, త్యాగం, సేవ, అంకితభావం, నిర్భీతి, క్రమశిక్షణకు మారు పేరు' అని ఖర్గే అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత తీవ్రం చేస్తుందని ఖర్గే పేర్కొన్నారు. కుల ఆధారిత జనగణన తప్పనిసరిగా జరగాలని ఆయన అన్నారు. జాతీయ విద్యా విధానం అనేది కేవలం ఆర్‌ఎస్‌ఎస్ విధానమని, దానికి కాంగ్రెస్ వ్యతిరేకమని ఆయన తెలిపారు. మనుస్మృతి తరహా విద్యను అందించేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు.



## శివారు ప్రాంతాల విద్యార్థులకు 100 అదనపు ట్రిప్పులు

### విద్యార్థినులకు ప్రత్యేక బస్సులు: ఆర్టీసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం 100 అదనపు బస్ ట్రిప్పులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఎండి సజ్జనర్ తెలిపారు. హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలను 12 కారిడార్‌లుగా విభజించి 350 వరకూ బస్సులను నడుపుతున్నామని చెప్పారు. ఇబ్రహీంపట్నం కారిడార్‌లోని కాలేజీలకు దాదాపు 44 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారని, వారిలో 3వ వంతు బస్ పాస్‌లు ఉన్నాయని తెలిపారు. అందుకు అనుగుణంగా 30 అదనపు ట్రిప్పులను అదనంగా నడపనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో 500 విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. విద్యార్థినులకు ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. కాగా విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, లోపలకు ఎక్కి సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


**నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్**

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

జోనల్ కార్యాలయం: 3-6-666, బర్వాలే ఛాంబర్స్, వీధి నెం.10, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029. తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం.040-29701389, మొబైల్: 9177377174

**ఇ-టెండర్ ద్వారా హ్యాండిలింగ్ మరియు ట్రాన్స్‌పోర్టేషన్ కాంట్రాక్టర్ల నియామకం**

ప్రీమియర్ CPSU అయిన M/s నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ వారు 2 సం॥ల కాలానికిగాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రేక్ పాయింట్ల వద్ద రెగ్యులర్ హ్యాండ్లింగ్ మరియు ట్రాన్స్‌పోర్టేషన్ కాంట్రాక్టర్ల నియామకం చేయగోరుచున్నారు. ప్రతీ రేక్ పాయింట్ యొక్క టెండరు డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్: www.nationalfertilizers.com మరియు http://etenders.gov.in/eprocure/app నుండి డౌన్‌లోడ్ చేసుకొని చూడవచ్చును.

| రాష్ట్రం | రేక్ పాయింట్ | దరఖాస్తు చివరి తేది |
|---|---|---|
| తెలంగాణ | కామారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, గద్వాల్, వరంగల్ | 20-03-2023 |
| ఆంధ్రప్రదేశ్ | కర్నూలు, ప్రసన్నాయపల్లి & ఆదోని | 27-03-2023 |

కేవలం ఇ-టెండర్లు మాత్రమే ఆమోదించబడతాయి. టెండరునకు ఏదైనా సవరణ/చేర్పు పై వెబ్‌సైట్లలో మాత్రమే డిస్‌ప్లే చేయబడును.

జోనల్ మేనేజర్


# కేంద్ర నిధులపై రాష్ట్రం వాదనలు పచ్చి అబద్ధం

- బిఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- తమిళినాడు బిజెపి ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి

**మొయినాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదనేమాట పచ్చిఅబద్ధమని, ఈ అబద్దాల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని, బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మాజీ ఎమ్మెల్సీ తమిళినాడు రాష్ట్ర బిజెపి ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు, శనివారం రాత్రి మొయి నాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జి గుణాల గోపాల్‌రెడ్డి, మంచిరేవుల శ్రీరామలు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ తమిళనాడు రాష్ట్ర బిజెపి ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం అభివృద్ధిలో ఏవిధంగా ముం దుకు దూసుకెళ్తుందో మనందరం చూస్తున్నామని అన్నారు, అదే తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీని నమ్మకంతో ఆశీర్వదిస్తే తెలంగాణ కూడ అభివృద్ధిలో ముందవరుసలో ఉంటుందన్నారు, రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదనే బిఆర్ఎస్ నాయకుల మాటలను ఆయన కొట్టిపారేస్తూ, కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా చిత్రీకరించి, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, తెలంగాణ ప్రజలు ఉద్యమాల నెత్తురు కలిగిన వారని, ఎక్కువ రోజులు బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మలేరని గుర్తుచేశారు, బిఆర్ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలను నేరవేర్చలేదని, అభివృద్ధిలో ముందువరుసలో ఉన్నామంటూ నిత్యం గొప్పలు చెప్పుకుని తిరిగే రాష్ట్ర ప్రభుత్వం, మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రం అప్పులకుప్పగా ఎలా అయిందో చెప్పాలని డిమాండ్ చేశారు, నరేంద్రమోడీ పథకాలను ప్రజలోకి తీసుకెళ్లడానికి బూత్‌స్థాయి అధ్యక్షులు పనిచేయాలని అన్నారు. తొమ్మిదేళ్ల కెసిఆర్ పరిపాలనలో కుంభకోణాలు, అరాచకాలు, అవినీతి, ఒకే కుటుంబ పాలన, రాజరిక వ్యవస్థ నడుస్తుందని, ప్రజాస్వామ్యంలో కెసిఆర్ రాజరిక పాలనను చూసి ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు ప్రజలు ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంవైపు చూస్తున్నారని తెలిపారు, కేంద్రం ప్రభుత్వం నుండి గడిచిన 4 సంవత్సరాల్లో చిల్కూర్ గ్రామానికి 4 కోట్ల నిధులు వచ్చాయని, అప్పోజిగూడ గ్రామానికి దాదాపు 74లక్షలు కేంద్ర నిధులు వచ్చాయని అన్నారు, ముఖ్య మంత్రి కెసిఆర్ అబద్ధపు కూతలు కూస్తున్నారని అన్నారు. అనంతరం వివిధ పార్టీల నుండి బిజెపి పార్టీలో చేరిన నాయకులకు కండువా వేసి ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోత్ర నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, దర్గా మహేందర్, ఉపాధ్య క్షుడు కొయ్యాడ రమేష్ కార్యదర్శులు శేఖర్‌గౌడ్, గుమ్మాల సీతారాంరెడ్డి, కిసాన్ మూర్తి అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, ఎంపిటిసి రమ్యరాజు తదితరులు పాల్గొన్నారు,

# ధ్యానం భారతదేశ సంస్కృతి

## క్రీడాకారులకు స్వర్గధామంగా కణ్హా శాంతివనం

## గ్రీన్ కణ్హా రన్‌ను ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర క్రీడా శాఖల మంత్రులు



కణ్హా శాంతివనంలో జరిగిన 2-కె గ్రీన్‌రన్‌లో కేంద్ర, రాష్ట్ర క్రీడా శాఖల మంత్రులు

**హైదరాబాద్ (నందిగామ) ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ధ్యానం భారతదేశ సంస్కృతి అన్ని,ప్రస్తుతం ప్రపంచ దేశాలన్ని మనవైపు చూస్తున్నాయని, ఇదే తరహాలో అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు పొందడానికి కణ్హాశాంతి వనం క్రీడా కేంద్రంగా రూపొందించడం గర్వకారణమని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కణ్హా శాంతి వనంలో నిర్వహించిన 2కేఎం గ్రీన్ కణ్హా రన్‌ను తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్,బ్యాడ్‌మెటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపిచంద్,రాంచంద్ర మిషన్ ట్రస్ట్ దాదాజీ కమెలేష్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పచ్చదనంతో నిండి ఆహ్లాదకరమైన ప్రదేశంలో క్రీడాభివృద్ధికోసం క్రీడా నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిన దాదాజీ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే మార్గదర్శకుడని కొనియాడారు.క్రీడాకారులకు శారీరకాభివృద్ధితో పాటు మానసిక ఆరోగ్యం పొందడానికి ఈ శాంతివనం దోహదపడుతుందన్నారు. రాష్ట్ర క్రీడల మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ....రాష్ట్రంలో యువత, దేశంలోని ప్రజలు సుభిక్షంగా ఆరోగ్యంగా ఉండాలనే నేపంతో మెంటల్ ఫిట్‌నెస్ కోసం యోగ,ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం క్రీడలు ఆవిష్కరించిన దాదాజికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 8 సంవత్సరంలో భారతదేశంలోనే అత్యంత గ్రీనరీని, భూగర్భజాలాని పెంచేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి చేశారన్నారు .తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు.ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం నిర్మించామన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 17600 గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామన్నారు.క్రీడలో కొత్త కొత్త విధానాలు అమలు చేస్తున్నామని ఇటీవలే కామన్ వెల్త్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానం రావడం జరిగిందన్నారు.భవిష్యత్తులో జరిగే ఒలంపిక్ క్రీడలో అద్భుతమైన క్రీడాకారులను తయారుచేయడం కోసం దాజీ ముందుకు రావడం గర్వకారణమన్నారు.భవిష్యత్ తరాల క్రీడాకారులకు మార్గదర్శకల కానుందన్నారు.

# కాకతీయ వర్సిటీకి ఐటీ శాఖ డిమాండ్ నోటీసులు

**ఎడ్యుకేషన్ కేయూ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** కాకతీయ యూనివర్సిటీకి మరోసారి ఐటీశాఖ డిమాండ్ నోటీసులు ఇచ్చింది. గతంలో కాకతీయ యూనివర్సిటీకి పలుమార్లు డిమాండ్ నోటీసులు ఇచ్చినా కేయూ అధికారులు (2016-17, 2017-18, 2018-19 అంచనా సంవత్సరాలు) ఆదాయ వ్యయాలకు రిటర్న్లు దాఖాలు చేయలేదు కాబట్టి ఐటీశాఖ వారు రూ.200కోట్లకు డిమాండ్ నోటీసులు ఇచ్చి అందులో 20శాతం రూ.40కోట్లు ట్యాక్స్ చెల్లించాలన్నారు. లేకుంటే యూనివర్శిటీ అకౌంట్స్ సీజ్‌చేస్తామని ఇటీవల హెచ్చరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో కేయూ ఉపకులపతి ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావులు హైదరాబాద్‌కు వెళ్లి ఐటీశాఖ అధికారులను కలిసి యూనివర్శిటీకి మరొక అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో మార్చి 7లోపు 25కోట్ల రూపాయలు ఇన్‌కం టాక్స్ చెల్లిస్తేనే ఆ స్టే నోటీసులు సెప్టెంబరు 30వరకు ఉంటుందని ఐటీ అధికారులు తెలిపారు. కేయూ అధికారుల అలసత్వం వల్లనే ఇంతవరకు వచ్చిందనే ఆరోపణలు యూనివర్సిటీలో చర్చించుకుంటున్నారు.

# వెనుకబడిన ప్రాంతాల్లో పిఎం స్వాస్థ్య సురక్ష యోజన

### తెలంగాణలో ఎయిమ్స్‌కు రూ.1,366 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** సార్వత్రిక ఆరోగ్య కవరేజీని నిర్ధారించడంలో కేంద్రం నిబద్ధతతో పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రాథమిక లేదా ద్వితీయ ఆరోగ్య సంరక్షణ, టెలికన్సల్టేషన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు చేరుకోవడం, తృతీయ సంరక్షణ సౌకర్యాలను బలోపేతం చేయడం, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఫీల్డ్ వర్కర్ల నైపుణ్యం, శిక్షణలో పెట్టుబడి పెట్టడం వంటి వివిధ అంశాలపై పనిచేస్తోంది. ఈమేరకు వీటికి సంబంధించి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆదివారం ఒక ప్రకటనలో వాటి వివరాలను తెలిపింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పిఎంఎస్ఎస్‌వై) పథకం కింద దేశంలోని వెనుకబడిన ప్రాంతాల్లో వైద్య, విద్య, పరిశోధన, క్లినికల్ కేర్‌లలో ఆరోగ్య సంరక్షణ సామర్థ్యాన్ని కల్పిస్తోంది. విశ్వసనీయ ఆరోగ్య సంరక్షణ సేవల లభ్యతలో ప్రాంతీయ అసమ తుల్యతను సరిదిద్దడం, దేశంలో నాణ్యమైన వైద్య విద్య కసం సౌకర్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానంగా ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎమ్ఎస్) ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది మంగళగిరి, నాగపూర్, భటిండాలోని ఎయిమ్స్‌లలో కోవిడ్ రోగుల చికిత్స కోసం పరిమితి ఐపిడి సౌకర్యాలు ప్రారంభించబడ్డాయి. కోవిడ్ టెస్ట్ ల్యాబ్ మంగళగిరి, నాగపూర్, ఒటిండాలోని ఎమ్స్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. 2021 నుండి గోరఖ్‌పూర్ ఎయిమ్స్‌లో 300 పడకల ఐపిడిని ప్రారంభించబడింది. అలాగే ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలు, సంస్థలను అప్‌గ్రేడేషన్ చేయడం జరుగుతోంది. కాగా తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణానికి కేంద్రం 1,366 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. బీబీనగర్ ఎయిమ్స్‌ను పూర్తి చేయడానికి 36 నెలల కాలపరిమితితో గత ఏడాది జూలై నెలలో టెండర్లను ఖరారు చేసింది. ఇందులో భాగంగా హాల్ ఇన్‌ఫ్రా టెక్ సర్వీసెస్‌తో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. దీని నిర్మాణం వేగవంతం అయ్యేందుకు ఇప్పటి వరకూ 350 కోట్ల రూపాయలను కూడా విడుదల చేసింది. అలాగే బీబీనగర్ ఎయిమ్స్‌కు వేతనాల కింద 65 కోట్ల రూపాయలు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధజంచి యుజి విద్యార్థుల మెడికల్ కోర్సులు, ఇతర అనుబంధ పనుల కోసం క్యాపిటల్ హెడ్ కింద 21.72 కోట్ల రూపాయలు, జనరల్ హెడ్ కింద 23.50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వెల్లడించింది.

# మోడీ మతోన్మాద జాతీయవాదం దేశానికి ప్రమాదకరం

## ● అఖిల భారత ఫార్వర్డ్‌బ్లాక్ జాతీయ మహాసభ ఆందోళన



అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన జి.దేవరాజన్‌ను సత్కరిస్తున్న జోజిరెడ్డి, రాములు యాదవ్ తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఫాసిస్ట్ మతోన్మాద జాతీయవాదం దేశానికి ప్రమాదకరమని అఃలభారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్తులో తమ పార్టీతో కలిసివచ్చే వామపక్ష, ప్రజాస్వామ్య ప్రగతిశీల పార్టీలతో కలిసి మోదీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా భారీఎత్తున ఉద్యమాలు నిర్మించాలని మహాసభ నిర్ణయించింది. నాలుగు రోజుల పాటు హైదరాబాద్ నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగిన అఃలభారత ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ మహాసభల్లో ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ నూతన జాతీయ కార్యదర్శిగా జి.దేవరాజన్ ఎన్నికవగా ఆయనతో పాటు జాతీయ చైర్మన్‌గా నరేన్ ఛట్టర్జీ, వైస్‌చైర్మన్‌గా పివి.కతిరవన్, కేంద్ర కార్యదర్శులుగా, కార్యదర్శులుగా ఆసిమ్ సిన్హా, దాలిరం, జ్యోతి రంజన్ మహాపాత్ర, సంజయ్ భట్టచార్య, బండా సురేందర్‌రెడ్డి, అమరేష్ కుమార్, మోహన్‌నంది, గోవింద్‌రాయ్, జిఆర్.శివశంకర్, బివాస్ చక్రవరిలతో పాటు 65మంది జాతీయ కార్యవర్గసభ్యులుగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన దేవరాజన్ మాట్లాడుతూ పార్టీ మహాసభలు తెలంగాణలో ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఈ మహాసభలలో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి నేతలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 84మంది ప్రతినిధులు దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై చర్చించడం జరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక దేశంలో మితవాద దాడికి తెరలేచిందని, మితవాద నయా-ఉదారవాద ఆర్థిక విధానాల కలయిక, హిందూత్వ ఎజెండా దాడులు దేశ పురోగతికి ప్రమాదకరమని, ఈ దాడిని ఎలలా ఎదుర్కోవాలి అనేదానిపై దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకి శక్తులతో కలిసి ఎదుర్కొవాలని సూచించారని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంబటి జోజి రెడ్డి, మహాసభల ఆహ్వానసంఘం సభ్యులు సుందరరామరాజు, కే.తేజ్‌దీప్ రెడ్డి, బి.రాములుయాదవ్, జి.వంశీధర్‌రెడ్డి, కొమ్మూరి వెంకటేశ్ యాదవ్, ఆవుల శ్రీకాంత్‌యాదవ్, సయ్యిద్ తౌఫిక్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఇందిరాపార్కులో గంధపుచెట్ల చోరీ

### అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఇందిరాపార్కులో మరోసారి గంధపుచెట్లు చోరీకి గురయ్యాయి. గాంధీనగర్ సీఐ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పది గంధపుచెట్లను నరికి ఎత్తుకు పోయారు. ఇందిరాపార్కు ఇన్‌చార్జి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్ల తెలిపారు. ఇందిరాపార్కులో సీసీ కెమేరాలు లేకపోవటం వల్ల దొంగలు ఎటువైపు నుండి వచ్చారు, ఎలా తీసుకుపోయారు, ఎవరైనా వారికి సహకరించారా అనే విషయాలపై దృష్టి పెట్టి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.



గంధపు చెట్లు

**స్థానికుల ఆగ్రహం**

గతంలో కూడా రెండు సార్లు గంధపుచెట్లు దొంగతనం జరిగాయని, అగ్నిప్రమాదాలు కూడా జరిగాయని, పార్కులో భద్రత కట్టుదిట్టం చేయాలని, సీసీ కెమేరాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొంగలు ఎలా రాగలిగారు, అంత పెద్ద చెట్లు నరికి తీసుకుపోతూ ఉంటే సెక్యూరిటీ వాళ్లు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇందిరాపార్కుకు సంబంధించిన వారే ఎవరైనా దొంగలకు సహకరించి ఉండవచ్చుననే అనేమానం స్థానికులు వ్యక్త పరుస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, ఈ దొంగతనం వెనక ఎవరు ఉన్నా కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల ఖాతాల్లో నేడే పిఎం కిసాన్ నిధులు జమ

## దేశవ్యాప్తంగా రూ.16,800 కోట్లు నగదు బదలీ

## ఇప్పటి వరకూ రూ.2 లక్షల 25 వేల కోట్లు విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద రైతులకు రబీ పెట్టుబడి సాయం అందనుంది. ఇందుకు గాను ఈ నెల 27వ తేదీ సోమవారం దేశంలోని 8 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి 16 వేల 800 కోట్ల రూపాయలను జమ చేయనున్నారు. రబీ సీజన్ నిమిత్తం రైతులకు పెట్టుబడి సాయంగా ఇది ఉపయోగపడుతుంది. కర్ణాటక లోని బెళగావిలో సోమవారం నిర్వహించే ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొని ఈ నిధులు విడుదల చేస్తారని ఆదివారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు. పిఎం కిసాన్, జల్‌జీవన్ మిషన్ లబ్దిదారులతో సహా లక్ష మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాగా రైతులకు పెట్టుబడి సాయంగా పీఎం కిసాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబరులో ప్రారంభించి ప్రతీ ఏడాది రైతుల ఖాతాల్లోకి 6 వేల రూపాయలను జమ చేస్తోంది. నాలుగు నెలలకు ఒకసారి 2 వేల రూపాయల చొప్పున మూడు విడతల్లో ఈ నిధులను విడుదల చేస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు వెళుతోంది. గత ఏడాది మే నెలలో 11వ విడత, అక్టోబరు నెలలో 12వ విడత సాయాన్ని విడుదల చేశారు. ఈ విధంగా ఇప్పటి వరకూ పిఎం కిసాన్ పథకం కింద దేశ వ్యాప్తంగా 2.25 లక్షల కోట్ల రూపాయలను 11 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు అందించింది. కరోనా సమయంలోనే 1.75 లక్షల కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఇందులో మహిళా రైతులకు మొత్తంగా 53,600 కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్లు వెల్లడించింది. పిఎం కిసాన్ పథకం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని కేంద్రం ఈ సందర్భంగా పేర్కొంది. రైతులకు నగదు లభ్యత పెరిగిందని తెలిపింది. వ్యవసాయ పెట్టుబడుల విషయంలోనూ ఆశాజనకమైన ఫలితం కనిపిస్తోందని వివరించింది. రైతులు రిస్క్ తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని, తద్వారా ఉత్పాదక మరింత పెరుగుతోందని పేర్కొంది. వ్యవసాయ అవసరాలతో పాటు, విద్య, వైద్యం, పిల్లల వివాహం వంటి వాటికి పిఎం కిసాన్ నిధులు రైతులకు ఉపయోగపడుతున్నాయని ఇంటర్నేషనల్ ఫుడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది.

# గోమాత విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పాలి

### కేంద్రమంత్రి జైశంకర్‌ని కోరిన వందేమాతరం జాతీయ అధ్యక్షుడు పెరిక సురేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** గోమాత విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పాలని నమో వందే గోమాతరం జాతీయ అధ్యక్షులు పెరిక సురేష్ కేంద్ర మంత్రి జైశంకర్‌నుకోరారు. నగరంలో ఒక హోటల్‌లో జరిగిన ఫోరం ఫర్ ఇంటర్నలిస్ట్ థింకర్స్ ఆద్వర్యంలో ఇండియాస్ జి 20 ప్రెసిడెన్సీ అనే అంశంపై టాక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కలిసి గోమాత ప్రతిమను బహుకరించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన గోవును ఆరాధించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గోమాత విశిష్టతను ప్రపంచానికి విస్తృత అవగాహన కల్పిండానికి విదేశాంగా మంత్రి కృషి చేయాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నమోగోమాతరం జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌లో రూ.1,45,845 కోట్ల ధాన్యం సేకరణ

### రబీలో 900 లక్షల టన్నుల దిగుబడి అంచనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఖరీఫ్ సీజనులో ఇప్పటి వరకూ 700 లక్షల టన్నులకు పైగా ధాన్యం సేకరణ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం 96 లక్షల మంది రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణకు సంబంధించి మొత్తం 1,45,845 కోట్ల రూపాయలను వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడం జరిగిందని తెలిపింది. ఇప్పటి వరకూ సెంట్రల్ పూల్‌లో సేకరించిన ధాన్యం నుండి బియ్యం పంపిణీ నిమిత్తం దాదాపు 218 లక్షల టన్నులు దేశ అవసరాలు తీర్చేందుకు స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుత 2022-23 సంవత్సరం యొక్క ఖరీఫ్ పంట కోసం, అలాగే 2021-22లో వాస్తవానికి సేకరించిన 749 లక్షల టన్నుల ధాన్యం బియ్యం పరంగా చూస్తే 503 లక్షల టన్నుల నుండి 765.43 లక్షల టన్నుల ధాన్యం (514 లక్షల టన్నుల బియ్యం) కొనుగోలు చేయబడుతుందని అంచనా వేయబడినట్లు వివరించారు. కాగా ప్రస్తుత 2022-23 రబీ సీజనుకు సంబంధించి ఎలాంటి అవాంతరాలు లేకుండా ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సీజనులో ధాన్యం సేకరణకు గాను మార్చి 1వ తేదీన జరగనున్న ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శుల సమావేశంలో ఖరారు చేయనున్నారు. ఈ రబీ సీజనులో దాదాపు 900 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని, ఈ మొత్తం సేకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

# హాస్టల్ విద్యార్థినులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** సంక్షేమ హాస్టల్ విద్యార్థినులకు చదువుతో పాటు, క్రీడల్లో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను తెలంగాణ సర్కార్ చేపట్టింది. ఇందులో భాగంగా ఉచితంగా ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తుంది. ఇందుకుగాను ఒక్కో విద్యార్థినికి 3 వేల రూపాయలను ఖర్చు చేస్తుంది. హిమాలయ శిఖరాలను అధిరోహించిన విద్యార్థిని మలావత్ పూర్ణను ఆదర్శంగా తీసుకుని పలువురికి ట్రెకింగ్‌లో శిక్షణ అంచేస్తున్నారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్, వనపర్తి, భువనగిరి జిల్లాల్లో దాదాపు 200 మంది విద్యార్థులకు ఇప్పటికే ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇచ్చారు. మరికొందరికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు సంక్షేమ అధికారులు చర్యలు చేపట్టారు.



# బిజెపి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు అనూహ్య స్పందన

### రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేలకు చేరువలో మీటింగ్

### మీటింగ్ తీరుతెన్నులపై జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించిన బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రజాగోస- బిజెపి భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు అనూహ్య లభిస్తుందని, క్షేత్రస్థాయిలో ఈ మీటింగ్‌ల పట్ల సానుకూల చర్చ జరుగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం బండి సంజయ్ జిల్లా అధ్యక్షులు, ఇంచార్జ్‌లతో సమావేశమై స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లపై సమీక్షించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇంచార్జ్‌లతో సమావేశమై స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లపై సమీక్షించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర కార్యాదర్శి కొల్లి మాధవి, అధికార ప్రతినిధి సంగప్పతో సమావేశం అయ్యారు. బిజెపి నాయకులు ఉత్సాహంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటూ స్థానిక సమస్యలపై చర్చించడంతో పాటు కెసిఆర్ పాలనా వైఫల్యాలను, క్షేంద్ర ప్రభుత్వ విజయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంతో పాటు సఫలీకృతమవుతున్నారని పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల సంఖ్య ఎనిమిది వేలకు చేరువలో ఉందని కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్ హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిరిసిల్లా, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఇచ్చిన టార్గెట్‌లో 80శాతం మేరకు మీటింగ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ మీటింగ్‌లో స్థానిక సమస్యలే ఎక్కువ చర్చకు వస్తున్నాయన్నారు. బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మీటింగ్‌ల ద్వారా పార్టీ తొలిదశ క్షేత్రస్థాయి ప్రచారం పూర్తిచేసు కున్నట్లయిందన్నారు. ఈ మీటింగ్‌లకు వస్తున్న స్పందనను చూసి బిఆర్ఎస్ నేతల్లో భయం మొదలైందన్నారు. అందుకే చాలాచోట్ల మీటింగ్‌లను బిఆర్ ఎస్ నేతలు అడ్డుకుంటూ ఉనికిచాటుకునేందుకు ప్రయాసపడుతున్నా రన్నారు.

**పేదల పార్టీ బిజెపి, పెద్దల పార్టీ బిఆర్ఎస్**

పేదల పార్టీ బిజెపి అయితే బిఆర్ఎస్ పెద్దల పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలంతా కెసిఆర్ పాలనపట్ల విసిగి పోయారన్నారు. వారంతా బిజెపివైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో ఓబిసి నేతల సమావేశం నిర్వహించారు. జాతీయ ఓబిసి కమిషన్ చైర్మన్ హన్సరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ ప్రధాన కార్యదర్శి గడిల శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్రానికి వచ్చిన హన్సరాజ్ గంగారాంకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలను జాతీయ నాయకత్వం గుర్తిస్తుందనేదానికి హన్సరాజ్ నిదర్శనం అన్నారు.

## బోడుప్పల్‌లో వక్ఫ్‌బోర్డు పేరిట ఉన్న

# భూములకు రిజిస్ట్రేషన్లు చేయాలి

### ● కాలనీల సంక్షేమ సంఘం ఛైర్మన్ రాపోలు రాములు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వక్ఫ్ బోర్డు భూములంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ ఛైర్మన్ రాపోలు రాములు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు భూములంటూ బోడుప్పల్‌లోని 328 ఎకరాల భూములను నిషేధిత జాబితా ఉంచారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితా నుంచి తొలగించి మళ్లీ రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేశారు. బోడుప్పల్ కార్పొరేషన్‌లోని సర్వే నంబర్ 21, 21, 22, 44, 45, 46, 47, 48, 49, 50, 52, 60, 61, 62, 66, 67, 68, 69, 91, 92, 93, 94, 102, 103, 104, 105, 106, 111, 116, 117, 118, 119, 120, 121, 122, 123, 124, 125, 126, 128, 129, 130, 150లో సుమారు 328 ఎకరాల భూములకు సంబంధించి 50 సంవత్సరాలకు పూర్వమే భూయజమానులకు పట్టదారు పాసుబుక్కులు, టైటిల్ డీడ్స్ ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ రికార్డులలో కూడా వారి పేర్లు పట్టాదారులుగా నమోదై ఉన్నాయని తెలిపారు. ఆ భూముల ఆధారంగానే రైతులు వారి భూములను అప్పటి బోడుప్పల్ గ్రామపంచాయతీ ఆఫీసులో నుంచి లేఅవుట్లు అనుమతులు తీసుకుని ప్లాట్లుగా మార్చి వేశారని, లేఅవుట్లగా మార్చిన ప్లాట్లను పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేశారని తెలిపారు. అయితే 328 ఎకరాల భూముల్లో దాదాపుగా 95 శాతం ఇళ్ల నిర్మాణం జరిగాయని పేర్కొన్నారు.

అయితే గత మూడు సంవత్సరాల నుంచి స్థానిక ప్రజలు కొనుగోలు చేసుకున్న తమ ఇళ్లను, ప్లాట్లను అమ్మాలన్న, కొనాలన్న ఉప్పల్‌లోని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు.. ఇది వక్ఫ్ బోర్డు భూమి కాబట్టి రిజిస్ట్రేషన్లు చేయమని చెపుతూ, ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు. దీంతో స్థానికులు తమ ప్లాట్లను అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికే ఇల్లు ఉండి దానిపైన మొదటి, రెండో అంతస్తుల భవనాలు నిర్మించుకోవాలంటే పర్మిషన్లు ఇవ్వడం లేదన్నారు. ఈ దృష్ట్యా వక్ఫ్ బోర్డు పేరుతో ఉన్న నాటి రైతుల భూములన్నింటిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించి గతంలోలాగా మళ్లీ రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాలనీ ఫెడరేషన్ వైస్‌చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు చెంచల నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్, కోశాధికారి కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ ఛైర్మన్ రాపోలు రాములు

# హైదరాబాద్‌లో లిథువేనియా కాన్సులేట్ కార్యాలయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి26:** ఐరోపా దేశమైన లిథువేనియా...హైదరాబాద్‌లో గౌరవ కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రథమ గౌరవ కాన్సులేట్‌గా దివి ల్యాబ్స్ సీఈవో కిరణ్ సశ్చంద్ర దివి నియమితులయ్యారు. ఢిల్లీలో ఇప్పటికే లిథువేనియా రాయబార కార్యాలయం ఉండగా, ముంబయి, కోల్‌కతా,బెంగుళూరులో కాన్సులేట్ కార్యాలయాలున్నాయి. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో రాయబార కార్యకలా పాలను పర్యవేక్షించేందుకు వీలుగా హైదరాబాద్‌లో కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పా టు చేసినట్లు లిథువేనియా రాయబార కార్యాలయం వెల్లడించింది. గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కాన్సులేట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి లిథువేనియా ఆర్థిక,ఇన్నోవేషన్ వైస్ మినిస్టర్ కరోలిస్ జమైటిస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యాలయం ఏర్పాటు వల్ల తెలుగు రాష్ట్రాల్లో లిథుయేనియన్ సంస్కృతి సంప్రదాయాలపై ఇక్కడి ప్రజల్లో అవగాహన కల్పించడానికి వీలువుతుందన్నారు. అంతేకాకుండా ఇక్కడ నివసి స్తున్న లిథువేనియా పౌరులకు మద్దతిచ్చినట్లవుతుందని చెప్పారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేత చేసుకునేందుకు మరింత అవకాశం ఏర్పడుతుందని అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో లిథువేనియా ఉనికిని పెంపొందింపచేయడానికి కృషి చేస్తానని నూతన కాన్సు లేట్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ సశ్చంద్ర తెలిపారు. భారత్‌లో లిథువేనియా విజయగాథల నిర్మాతలలో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

# కుటుంబ పాలనను అంతం చేసి రామరాజ్యాన్ని స్థాపించాలి : విజయశాంతి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** కెసిఆర్ కుటుంబ పాలనను అంతం చేసి రామరాజ్యం స్థాపించేందుకు బిజెపి అధికారంలోకి రావాలని బిజెపి కార్యవర్గ సభ్యురాలు సినీనటి విజయశాంతి పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న బిజెపి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో భాగంగా ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి రామాలయం శక్తికేంద్ర ఇన్‌చార్జి చేదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు, కూకట్‌పల్లి పాలక్ విజయశాంతి వచ్చారు. వీధి చివర సమావేశంలో పాల్గొన్న విజయశాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యం ఏలుతున్న అవినీతి, నిరంకుశ, నియంత, నియంత్రత్వ బిఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజలు పడుతున్న గోసా తీరాలంటే రాష్ట్రంలో బిజెపి పాలన రావాలన్నారు. ఈ కుటుంబ పాలనను అంత చేసి సస్యశ్యామలమైన రామరాజ్యం ఏర్పాటు చేస్తామని బిజెపి భరోసాను ఇస్తుందని అన్నారు.

